
# తల్లి మనసు

- వేలూరి కౌండిన్య



ఓ రాములమ్మా - నీ కొడుకును ఇస్కలారి గుద్దిందట. పోలీసోళ్ళు ధర్మాసుపత్రిలో పడేసినారట. వగరుస్తూ చెప్పాడు రిక్షా నారిగాడు.

"నానే చెర్లోపడ్డందేవుడో" అంటూ శోకండాలు పెట్టింది రాములమ్మ - ఓలప్పా బేగెల్లు - లేకుంటే - అక్కడ ఏదైన జరిగిందంటే నువ్వు పరేశాన్ అవ్వాలని రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

రాములమ్మ నెత్తి నోరు బాదుకుంటూ, దవాఖానాకు పరిగెత్తింది. నెత్తురోడుతూ ఇనుప మంచం మీద మూలుగుతున్నాడు సింహాచలం. పక్కనే వెంకటమ్మ. సింహాచలంగాడి పెళ్ళాం. ముక్కు చీదుకుంటూ ఏడుస్తుంది. అత్తను చూడగానే తిట్లు లంకించుకుంది. ముదనష్టముదానా. నీ దిష్టే కొట్టింది. రాయలాటోడు. ఎట్లాగైపోయాడో, ఎదవ సచ్చినోడి పుట్టిన రోజంట. నీ యదవముఖాన్ని చూడ్డానికే వత్తంటే - ఇస్కలారి గుద్దింది.

కొడుకును చూడగానే రాములమ్మ ఏడుపు లంకించుకుంది. "నానే గంగలో పడ్డం దేముడో" అంటూ తిట్ల దండకం అందుకుంది రాములమ్మ. - ఏమ్మా - ఇక్కడ - ఏడ్పులు - పెడబొబ్బలు కుదరవు - గమ్మునుంటే వుండండి లేదంటే బయటకు వెళ్లండి. విసుక్కుంది నర్సమ్మ సింహాచలం దెబ్బలకు కట్లు కడుతూ.

★ ★ ★

వెన్నెల పిండార బోసినట్లుగా వుంది. వేపచెట్టు క్రింద నులక మంచం మీద పడుకొని ఆకాశంలోకి చూస్తున్నాడు సింహాచలం. ఓ గవర్నమెంట్ ఆసుపత్రిలో అటెండరు.

కింద చాప మీద రాములమ్మ. ఏరా! పోరగా, ఇంకా ఎన్నాళ్ళు నీకు చాకిరీ చేస్తావుంటా. నీ మామ అప్పన్న సతాయిస్తున్నాడు. వెంకటమ్మను. నీకు ఇవ్వాలని వుందట.

వద్దేలమ్మా - వచ్చే గుంట ఎలాగుంటదో, ఏటో.

లోకంలో ఎంతమందిని చూడ్డం లేదు. మనువాడగానే, యేరే పొయ్యి అంటారు. మనం ఇట్టానే వుందామే. సింహాచలానికి తల్లంటే వల్లమాలిన ప్రేమ. తను కడుపులో వుండగానే తండ్రిని పోగొట్టుకున్నాడు భూమి మీద పడగానే. ఉన్న - కాస్త నీడా పోయింది. బ్రతుకు తెరువు వెతుక్కుంటూ దేశాలు పట్టి చివరకు బెజవాడ చేరింది. నోటి మంచితనం వల్ల త్వరలోనే నాలుగైదు ఇళ్ళు వాడకం కుదుర్చుకుంది. కొడుకును బలవంతంగానే వీధి బళ్ళో వేసింది. సింహాచలం స్వతహాగా తెలివిగలవాడు అవ్వటం వల్ల అన్ని క్లాసులు పాస్ అవుతూ చివరికి స్కూల్ ఫైనల్ మంచి మార్కులతో పాస్ అయ్యాడు.

> **అప్పు**
>
> తృప్తిగా
> తీసుకునేది
> అసంతృప్తిగా
> తీర్చేది
>
> - వై.కె.మూర్తి

రాములమ్మ వాళ్ళ కాళ్ళు, వీళ్ళ కాళ్ళు పట్టుకొని సింహాచలాన్ని అటెండర్‌గా ఉద్యోగం ఇప్పించింది. అప్పటి నుంచి సింహాచలం అంటే వాళ్ళ బంధువుల్లో - సర్కారీ కొలువు చేసే పెళ్ళి కొడుకు.

★ ★ ★

'ఓలమ్మో - నేను కొలువుకు పోతన్నా. మధ్యపేల - దవాఖానాకు పో. అసలే పొద్దున్నుంచి చేత కావటం లేదన్నావు. నీ కాడ పైసలున్నాయి కదా! అంటూ పాకవసారాలో వున్న సైకిల్‌ను బయటకు తీశాడు. ముఖం గంటు పెట్టుకొని వెంకటమ్మ కూడా బయటకు వచ్చింది.

నాకు పొగడ్రి తేవటానికి నీకు పైసలుండవు కాని మీయమ్మను, దవాఖానాకు పంపటానికి పైసలొస్తాయని సణుగుతోంది. అదికాదే. మాయమ్మకు జ్వరం కదా! అందుకు, అని సైకిల్ ఎక్కాడు. లోపలి నుంచి, రాములమ్మ అరుస్తోంది. అణ్ణి కొలువుకు ఎల్లనీ, నీ ముచ్చట్లు సాయంత్రం చెప్పుకోవచ్చు అంటోంది. ఈ ముసలి దానికి చావైనా రావటం లేదు. దీని కళ్ళు అన్నీ నా మీదే. సణుక్కుంటూ లోపలికొచ్చింది.

సాయంత్రం 5 గంటలవుతోంది. సింహాచలం వస్తూనే అమ్మా ఇదిగో. జీతం - నీకు జ్వరం అని పళ్ళు తెచ్చాను అంటూ, జీతం డబ్బులు - పళ్ళ సంచి చేతికి ఇచ్చాడు.

ఇవాళ జీతం ఇస్తారని, మొగుడు జీతం డబ్బులు తీసుకొచ్చి చేతిలో పెడతాడని పొద్దున్నుంచి కలలు కంటున్న వెంకటమ్మ, సింహాచలం జీతం డబ్బులు తల్లికి ఇవ్వడంతో ముఖం మాడ్చుకుంది.

అరే సింహాచలం - ఈ జీతం తీసుకెళ్ళి నీ పెళ్ళానికి ఇవ్వరా! అది కూడా ఇల్లు సాపటం నేర్చుకుంటుంది అంది. దాని ముఖం. దానికేటి తెలుస్తది. జీతం దానికిస్తే వారం నుండి మనం పస్తులుండాల్సిందే. అంటున్నాడు. సింహాచలం మాటలకు ముఖం మొటమొటలాడించుకుంటూ గదిలోకి పోయింది వెంకటమ్మ.

'అమ్మా' - మలాటికి సినిమాకు పోతున్నాం - నువ్వు కూడా రా! అంటున్నాడు.

నేనెందుకు లేరా! మీరెళ్ళండి అంటోంది.

ఎక్కడ సినిమాకు వస్తదో అని - ఏవయ్యో అంటూ సింహాచలాన్ని కేకేసింది వెంకటమ్మ.

★ ★ ★

ఇల్లు సాపటం రాములమ్మ చేతిలోంచి వెంకటమ్మ చేతుల్లోకి వచ్చింది. సింహాచలానికి సర్కారీ పని కుదిరింతరువాత పాచి పనులు మానేసిన వెంకటమ్మకు మళ్ళీ ఆ పని తప్పలేదు. గుడిసె కూడా మారాల్సి వచ్చింది. వెంకటమ్మకు తెలీకుండా, సింహాచలం తల్లికి పది పరకా సాయం చేస్తూనే వున్నాడు. వెంకటమ్మ నోటికి భయపడి వేరే వుంటున్నాడేకాని. ప్రాణాలన్నీ తల్లి మీదే.

★ ★ ★

'ఏమ్మో' సింహాచలానికి చాలా నెత్తురు పోయింది. రక్తం ఎక్కించాలి చెపుతోంది నర్సు. విననట్లే తండ్రిని తీసుకొని బయటకు వెళ్ళిపోయింది వెంకటమ్మ. సింహాచలానికి అటు ఇటు అయితే సర్కారీ కొలువు వస్తుందా! రాదా! అని తండ్రితో మంతనాలు ఆడుతోంది.

అక్కడ రాములమ్మ మనసు కొట్టుకులాడుతోంది. అయ్యో సింహాచలం అప్పన్న, వీరవల్లి నాంచారమ్మ, బొబ్బిలి పోలేరమ్మ నా కొడుకును కాపాడు తల్లీ. నీకు నల్ల మేకను బలి ఇస్తా అంటూ, కనపడని దేవుళ్ళకు మొక్కుకుంటోంది. కొల్లేరు పెద్దింటమ్మ, నీకు పొర్లుదండాలు పెడతా అంటూ లెంపలు వేసుకుంటోంది.

ఏమ్మా చెపితే అర్థం కావటం లేదా! పెద్ద డాక్టరు గారి దగ్గరకు వెళ్ళు చీటి ఇస్తారు. అది తీసుకొని రక్తం సీసాలు తే, లేకపోతే నీ ఇష్టం అని చెపుతోంది. ఇదిగో నర్సమ్మా, ఇప్పుడే పోతన్నా అంటూ పెద్ద డాక్టర్ వున్న గదిలోకి వెళ్లింది.

దేవతలు దయ తలిచి సింహాచలానికి భూమి మీద నూకలుండి బతికి బట్ట కట్టాడు. ఆరోజే సింహాచలాన్ని ఇంటికి పంపే రోజు. రాములమ్మ. పెద్దింటమ్మకు మొక్కు తీర్చుకొని ఆసుపత్రి రోడ్డు దాటుతోంది. అప్పుడే వేగంగా వచ్చిన సిటీబస్సు రాములమ్మను గుద్దుకుంటూ వెళ్ళిపోయింది. కొడకా! అనే అరుపు, ట్రాఫిక్ హోరులో కలిసిపోయింది. అప్పుడే మొగుడి భుజాల మీద చేతులేసుకొని రిక్షా ఎక్కుతోంది వెంకటమ్మ. ○


## మోనికా బుక్స్

**ఒకే ఒక్కడు**
(ఎన్.టి.ఆర్. జీవితకథ)
వెల 150 రూపాయలు

**విశ్వవిహారం**
(యాత్రా రచన)
వెల 60 రూపాయలు

**ఐ.వి.ఆర్.-రాజసూయం**
(ఉలుకు-పలుకు వ్యాసాల సంకలనం)
వెల 75 రూపాయలు

విశాలాంధ్ర బుక్‌హౌస్‌తో సహా ప్రముఖ పుస్తకాల షాపులలో ఇవి లభిస్తాయి. పోస్టు ద్వారా తెప్పించుకోదలచిన పాఠక మిత్రులు పుస్తకం విలువను ఎం.ఓ. లేదా డి.డి. రూపంలో ఈ క్రింది అడ్రసుకు పంపండి. పోస్టేజి ఉచితం.

**మోనికా బుక్స్**
79బి, జర్నలిస్ట్స్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.